వసతులు సమకూరుతున్నయ్ !

- అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రభుత్వ పాఠశాలల్లో చురుగ్గా పనులు
- విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు
- మరుగుదొడ్లకు మరమ్మతులు

గుర్రంపోడు : అమ్మ ఆదర్శ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. పాఠశాలల్లో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు, మంచినీటి వసతుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఏటా అరకొరగా అందే స్కూల్ గ్రాంటు నిధులు పాఠశాల నిర్వహణకే సరిపోక ప్రధానోపాధ్యాయులు మరమ్మతులు చేసే అవకాశం లేక అసౌకర్యాల మధ్యనే వాటిని వినియోగించేవారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం అమ్మ ఆదర్శ పథకం ద్వారా అవసరమైన పాఠశాలలను గుర్తించి నిధులు మంజూరు చేసింది. మండలంలో 30 పాఠశాలలకు రూ.1.3కోట్లు మంజూరు కాగా పనులు చివరిదశలో ఉన్నాయి. ఇప్పటికే కోయగూరవారిబావి, ఆరెగూడెం, వెంకటాపురం(కె) పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తయ్యాయి.

అమ్మ ఆదర్శ కమిటీలతో పక్కాగా..

ప్రభుత్వం ఇటీవల సంఘబంధం గ్రామ విలేజ్ ఆర్గనైజర్‌లను పాఠశాలలకు చైర్‌పర్సన్లుగా నియమించింది. పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా ఉండి జాయింట్ ఖాతాలో ముందుగానే పాఠశాలలకు అడ్వాన్సుగా నిధులు జమచేయడంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు పాఠశాల పైకప్పుపై ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి కింద సంపు, ఇన్‌వెల్ మోటారు, టైల్స్‌తో నీటి కుళాయిల సముదాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అన్ని గదుల్లో కరెంటు సౌకర్యం, ట్యూబ్‌లైట్లు, కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎంపీడీఓ, ఏఈల పర్యవేక్షణలో పనులు వేగంగా జరుగుతున్నాయి.


పాల్వాయి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన నల్లాలు

అసంపూర్తిగా మన ఊరు మన బడి పనులు

గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం మన ఊరు మన బడి కింద చేపట్టిన అభివృద్ధి పనులు చాలా పాఠశాలల్లో అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని పనులు పూర్తికాగా చేసిన పనులకు కొన్ని చోట్ల బిల్లులు అందలేదు. ప్రస్తుతానికి మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం జరగక పోవడంతో అసంపూర్తిగా దర్శనం ఇస్తున్నాయి. అమ్మ ఆదర్శ పనులు పూర్తయిన తర్వాత వీటిపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

బడిని బాగు చేసుకునే అవకాశం



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రెండు జతల యూనిఫాం కుట్టించే బాధ్యత అప్పగించడం వల్ల మహిళా సంఘాలకు ఉపాధి లభిస్తుంది. తద్వారా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పాఠశాలల చైర్‌పర్సన్లుగా వీఓలను నియమించడంతో మహిళా సంఘాలకు తమ ఊరి బడిని బాగు చేసుకునే అవకాశం లభించింది.

– తరి ఉమారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు

కాంగ్రెస్ హయాంలోనే మెరుగైన పాలన

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

త్రిపురారం : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు మెరుగైన పాలన అందుతోందని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పేర్కొన్నారు. నిడమనూరు, త్రిపురారం మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన 164మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మరో ఏడాదిలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నిడమనూరు, త్రిపురారం మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

సాగునీటి సౌకర్యం కల్పించాలని రైతుల ధర్నా


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

వేములపల్లి(మాడ్గులపల్లి) : సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ మాడ్గులపల్లి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం కన్నెకల్– ముషంపల్లి రోడ్డుపై తాటి చెట్లు వేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మాపురం చెరువు నింపేందుకు జరుగుతున్న ఎస్‌ఎల్‌బీసీ 24ఆర్ కాల్వ పనులను ఆ గ్రామానికి చెందిన రైతు అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. కాల్వ పనులు సాగుతున్న భూమికి గతంలో ఆ రైతుకు ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించిందని తెలిపారు. అధికారులు స్పందించి కాల్వ పనులు పూర్తి చేయించి, ధర్మాపురం చెరువు నింపి సమస్య తీర్చాలని కోరారు. విషయం తెలుసుకున్న నిడమనూరు పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

విచారణ జరిపించాలి

మిర్యాలగూడ : మిర్యాలగూడ రెవెన్యూ శివారులోని భూముల రెవెన్యూ రికార్డుల్లో అవకతవకలు జరిగాయని, విచారణ జరిపించాలని కోరుతూ పట్టణానికి చెందిన ఉబ్బపల్లి రాములమ్మ బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ శివారులోని సర్వే నం. 710, 711లలో తమకు 16.36ఎకరాలు ఉందని తెలిపారు. దానిలో పాలివారికి సంబంధించిన భూమిని విక్రయించుకున్నారని తెలిపారు. మా అత్తగారైన ఉబ్బపల్లి లచ్చమ్మ పేరు మీద ఉన్న సర్వే నం .711లో 31గుంటలు ఎవరికీ అమ్మలేదని, 2023వ సంవత్సరం ఆగస్టు వరకు కబ్జాలోనే ఉన్నామని తెలిపారు. ఆ తర్వాత 2023 ఆగస్టులో ముప్ప అంకయ్య, వెంగమ్మ సంబంధీకులు దౌర్జన్యంగా తమ భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి, బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సర్వే నెం.711లో 31గుంటల భూమి రికార్డులపై విచారణ జరిపించి న్యాయం చేయాలని బాధితురాలు వినతిపత్రంలో కోరింది.

గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కమిటీ ఎన్నిక


ధీరావత్ శంకర్‌నాయక్


రమావత్ వాల్యానాయక్

పెద్దవూర: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం మండల కమిటీని బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన సంఘం సర్వ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర కృష్ణకాంత్‌నాయక్ వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా ధీరావత్ శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ వాల్యానాయక్, ఉపాధ్యక్షుడిగా ధనావత్ సుశీల, కోశాధికారిగా ధీరావత్ హనుమనాయక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు బాణావత్ సైదులునాయక్, ఉపాధ్యక్షుడు తిరుపతినాయక్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి తహసీల్దార్‌గా సురేష్


బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్

వేములపల్లి (మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండల తహసీల్దార్‌గా ఎస్.సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అడవిదేవులపల్లి మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సురేష్ మాడ్గులపల్లి మండలానికి బదిలీపై రాగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పద్మ కలెక్టరేట్‌కు వెళ్లారు. నూతన తహసీల్దార్ సురేష్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినికి అభినందన

మిర్యాలగూడ: నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పట్టణంలోని ఆదిత్య పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గంటల సహస్రరెడ్డి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సహస్రను కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి అభినందించి మెడల్‌తో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలని ప్లకార్డుతో ప్రదర్శన



ప్లకార్డు ప్రదర్శిస్తున్న శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మిర్యాలగూడ మండలం నందిపాడుకు చెందిన రావుల శ్రీనివాస్ కోరాడు. సేవ్ ట్రీస్ సేవ్ ది గ్లోబల్ అనే నినాదంతో రాసిన ప్లకార్డును చేతపట్టుకుని కొన్నేళ్లుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. దానిలో భాగంగా బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలం వద్ద ప్లకార్డును ప్రదర్శిస్తూ మొక్కల పెంపకానికి యువత ముదుకు రావాలని కోరాడు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

పెద్దవూర: దాతలు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని ఎంఈఓ తరి రాములు కోరారు. బుధవారం మండలంలోని వెల్మగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్, మద్దూరి కృష్ణ సమకూర్చిన టై, బెల్టులు, ఐడీ కార్డులను ఎంఈఓ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం దాతలు శ్రీనివాస్, కృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లక్ష్మీసురేందర్, ఉపాధ్యాయులు రహీం, నామిరెడ్డి ప్రశాంతి, ఉప్పునూతల వెంకయ్య, సత్యం, నారమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు టై,బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ తరి రాములు తదితరులు

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శౌరీలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత పరీక్ష ఫిబ్రవరి 23న నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వీరస్వామి

మిర్యాలగూడ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎంవీఐ వీరస్వామి కోరారు. బుధవారం పట్టణంలోని ఎన్‌టీఆర్ కాంప్లెక్స్‌లో టాక్సీ డ్రైవర్లు, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో టాక్సీ డ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం


హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

హాలియా : విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కె) డాక్టర్స్ రాంబాబు, డాక్టర్ రజిత సూచించారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో బుధవారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, మంచినీరు ఎక్కువగా తాగాలని సూచించారు. వారానికి ఒకసారి కచ్చితంగా చేతి గోర్లను కత్తిరించుకోవాలని, రోజుకు 8గంటలు నిద్రించాలని సూచించారు. కళాశాల ప్రిన్స్‌పాల్ జాకీర్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫార్మసిస్ట్ సునితచ ఏఎన్‌ఎం లలిత, కళాశాల లెక్చరర్లు ఆదిరెడ్డి, లింగమూర్తి, వెంకట్, బాలరాజు, రోశయ్య, సుజాత ఉన్నారు.

దాడిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన

మిర్యాలగూడ టౌన్ : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని నిరసిస్తూ బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ముందస్తుగానే కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మపై పెట్రోల్ పోసుకుని, దహనం చేసేందుకు అక్కడికి చేరుకున్న బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, నాయకులు నేత బంటు సైదులు, నాగిరెడ్డి మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి దిగజారుడు పనులు చేయడం సరికాదని హితవు పలికారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగిరెడ్డి, రమేష్, కొండేటి సరితశేఖర్, చల్లమల్ల సీతారాం రెడ్డి, రాజశేఖర్‌నాయక్, జువ్వాది సత్యనారాయణ, పెద్దబోయిన వెంకటరమణ, బంటు గిరి, సుధాకర్, చిలుకూరి శ్యాం, మేడి నవీన్, పెద్దమాం భరత్, సైదులు, గుండ్లపల్లి శ్రీకాంత్, యాదాబాయి, సత్యప్రసాద్, నక్క శ్రీను, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ కార్యాలయంపై దాడి సరికాదు

పెద్దఅడిశర్లపల్లి : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య అని అభివర్ణించారు. సమావేశంలో నాయకులు పోతెం కర్ణాకర్, వరికుప్పల శ్రీరాములు, గుండాల శ్రీను, రమేష్ తదితరులున్నారు.

తెలంగాణ గోల్డ్‌కప్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: ది తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మిర్యాలగూడలో నిర్వహించే తెలంగాణ గోల్డ్ కప్–2025 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల పోస్టర్‌ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికంగా, శారీరకంగా ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా గ్రామీణ క్రీడాకారులకు మంచి అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఈశ్వర్, గణేష్, కోచ్ కావలి వెంకన్న, పోతుల నరేందర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లా బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో నల్లా బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ వాటర్ సప్లయ్ ఫిట్టర్లను ఆదేశించారు. బుధవారం ఫిట్టర్లకు బిల్లులు ఇచ్చే మిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మున్సిపాలిటీలో మొత్తం రూ. కోట్ల నల్లా బిల్లులు వసూలు కావాల్సి ఉందన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 14వేల 650 నల్లాలు ఉన్నాయని, 80వరకు కమర్షియల్ నల్లాలున్నాయని పేర్కొన్నారు. వాటర్ బిల్లుల వసూళ్లకు అందరు సహకరించాలని కోరారు. వారి వెంట మున్సిపల్ డీఈ వెంకన్న, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, ఫిట్టర్లు శ్రీరాములు, జానయ్య, శ్రీనివాస్‌రావు, కోటయ్య, సాదిక్, పరశురాములు, రంగారావు, కె. పరశురాములు తదితరులు పాల్గొన్నారు.


ఫిట్టర్లకు మిషన్లు అందజేస్తున్న కమిషనర్, డీఈలు

'అగ్రవర్ణాల వారికే టికెట్ల కేటాయింపు సరికాదు'

మిర్యాలగూడ టౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అగ్రవర్ణానికి చెందిన వారినే ఆయా సంఘాలు ప్రకటించడం సరికాదని, వారిని మార్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 80శాతం మంది ఉన్న బడుగులకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, గుండెబోయిన నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ యాదవ్, దోనేటి శేఖర్, రాంబాబు, సతీష్ తదితరులున్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



కొండమల్లేపల్లి : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు తదితరులు

హాలియా : ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని అనుముల మండల ఎంఈఓ గుండా కృష్ణమూర్తి అన్నారు. తపస్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు గుర్రం ప్రభాకర్‌రెడ్డి, అనుముల మండల అధ్యక్ష, కార్యదర్శులు రేణుకుంట్ల రాజశేఖర్, గుర్రం సత్యనారాయణ రెడ్డి, మండల బాధ్యులు అక్కయ్య బాబు, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవి, శకుంతల, పాఠశాల ఉపాధ్యాయులు శైలజ, వెంకటరెడ్డి, అంజయ్య, కల్పన, కవిత ఉన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం టీపీయూఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ నాగేశ్వర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమిరే సైదులు, బద్దెల అంజయ్య, సరస్వతి, శోభారాణి, వసుందర, ఆంజనేయులు, శ్రీధర్, వరలక్ష్మి, మానస, జ్యోతి, శ్రీకాంత్‌రెడ్డి, పరమేష్, గీతాంజలి పాల్గొన్నారు.

త్రిపురారం మండల ప్రత్యేక అధికారిగా లీలా


ప్రత్యేక అధికారి లీలాను సన్మానిస్తున్న నాయకులు

త్రిపురారం : త్రిపురారం మండల ప్రత్యేక అధికారిగా వి.లీలా బుధవారం బాధ్యతలు చేపట్టారు. దీంతో మండల కాంగ్రెస్ నాయకులు, అధికారులు మండల ప్రత్యేక అధికారి వి.లీలాను ఎంపీడీఓ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా లీలా మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమారి, తహసీల్దార్ గాజుల ప్రమీలా, ఏఈఓ రవి నాయక్, పీఆర్ ఏఈ శ్రీనివాస్, కాంగ్రెస్ త్రిపురారం మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, బిట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన దళిత హక్కుల పోరాట సమితి జాతీయ మహాసభల్లో గుండెపోటుతో మృతిచెందిన కేరళ రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కె.ఆర్.విజ్జు కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో విజ్జు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వల్లంపట్ల వెంకన్న, బంటు వెంకటేశ్వర్లు, ఎండి.సయ్యద్ రహీం, పాల్వాయి సుందర్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గుర్రంపోడు: ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీసీ కెమెరాల ద్వారా పోలీసులు కనిపెట్టి అతడికి అప్పగించారు. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన పురుషోత్తం బుధవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద లక్షన్నర రూపాయల విలువైన తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా సెల్‌ఫోన్ దొరికిన వ్యక్తిని గుర్తించి రెండు గంటల్లోనే అతడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు. బాధితుడు ఎస్ఐ మధు, పోలీస్ సిబ్బంది కిరణ్, సైదులుకు కృతజ్ఞతలు తెలిపాడు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు కృషిచేయాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి సూచించారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన సాధన ఫీస్ట్ ఆఫ్ క్రియేటివిటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రవి

పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి

అడవిదేవులపల్లి : ప్రభుత్వ భూముల సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు మంజూరు చేయాలని యువజన కాంగ్రెస్ మండల నాయకుడు కొర్ర అశోక్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. తాతాల కాలం నుంచి పేదల ఆధీనంలో ఉన్న భూ ములు గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి యాప్‌తో పట్టాలు లేకుండా పోయాయని తెలిపారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

డిండి/చందంపేట: పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ గురువారం డిండి, చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల నాయకులు దొంతినేని వెంకటేశ్వరరావు, జరుపుల భద్యానాయక్, లోకసాని కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

బాధ్యతతో పనిచేయాలి

వేములపల్లి(మాడ్గులపల్లి): 108 అంబులెన్స్‌లలో

సంక్షిప్త సమాచారం

పనిచేసే ఉద్యోగులు బాధ్యతగా విధులను నిర్వర్తించాలని జిల్లా సూపర్‌వైజర్ మధు అన్నారు. బుధవారం ఆయన మాడ్గులపల్లిలో 108 వాహనాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీరొద్దీన్, ఈఎంటీ వెలిజాల సైదులు, అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గుర్రంపోడు : మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు వద్దిరెడ్డి లక్ష్మారెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌లు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గాయపడిన వ్యక్తికి..

చందంపేట: ఓ వ్యక్తి దాడిలో గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పొగిళ్ల గ్రామానికి చెందిన బట్టు వెంకటయ్యను బుధవారం యాదవ సంఘం నాయకులు పరామర్శించారు. వెంకయ్య ఇటీవల నాంపల్లి మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో గొర్రెలు మేపుకుంటుండగా స్థానికుడైన నర్సిరెడ్డి దాడి చేయడంతో గాయపడ్డాడని తెలిపారు. పరామర్శించిన వారిలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడు కొండలయాదవ్, కొండ్రం మల్లేశ్వరి, శ్రీశైలం యాదవ్, సంజీవ, ఎల్లయ్య, చవ్వ నారాయణ, గడ్డం వెంకటయ్య ఉన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

త్రిపురారం : రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని నిడమనూరు మార్కెట్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం నిడమనూరు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పశువులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి చందర్ రావు, ముంగి శివమారయ్య, ఉన్నం చిన్న వీరయ్య పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

మిర్యాలగూడ : పట్టణంలోని చర్చి రోడ్డులో బుధవారం 36వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి అబ్దుల్లా సొంత ఖర్చులతో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. ప్రమాదాల నివారణకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు అబ్దుల్లా పేర్కొన్నారు.

బెజ్జికల్‌లో ట్రాక్టర్ ట్రాలీ చోరీ

త్రిపురారం : గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్ ట్రాలీని చోరీ చేశారు. త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామంలో జరిగిన ఈ ఘటనపై బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జికల్ గ్రామానికి చెందిన రైతు ఇంజం ధనలక్ష్మి ట్రాక్టర్‌లో మంగళవారం సాయంత్రం డ్రైవర్ నారు వేసుకుని గ్రామ శివారులోని యజమాని పొలానికి వెళ్లాడు. అక్కడ నారును అన్‌లోడ్ చేశాడు. ఉదయం పని ఉండడంతో ట్రాలీని అక్కడే వదిలేసి ఇంజన్‌తో యజమాని ఇంటికి చేరుకున్నాడు. తిరిగి బుధవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లడంతో ట్రాలీ కనిపించలేదు. దుండగులు అపహరించారని త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళా రైతు ధనలక్ష్మి తెలిపారు.

ముగ్గురు యువకులకు ఒక రోజు శిక్ష

డిండి: మండల పరిధిలోని కందుకూర్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు ఒక రోజు శిక్ష విధిస్తూ దేవరకొండ స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ పొట్ట చెన్నయ్య బుధవారం తీర్పునిచ్చారు. కేసు వివరాలు.. మండలంలోని కందుకూర్‌కు చెందిన కోకా అభిషేక్, బర్పటి జోసెఫ్, ఇరిగదిండ్ల శివాజీ ఈ నెల 3న మద్యం తాగి అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై దాడికి యత్నించి న్యూసెన్స్ చేశారు. దీంతో వారిపై డిండి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వారిని బుధవారం దేవరకొండ స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా కమ్యూనిటీ సర్వీస్ కింద కోర్టు ఆవరణను రోజంతా శుభ్రం చేయాలని తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

నీటి మడుగులో పడి మహిళ మృతి

మిర్యాలగూడ టౌన్: నీటి మడుగులో పడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన మిర్యాలగూడ మండలంలో బుధవారం జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ–2 వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన వెలిజాల యాదమ్మ(54) రోజు మాదిరిగానే మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్లాపురం రోడ్డులో నాట్లు వేసేందుకు వెళ్లింది. నాట్లు వేస్తుండగా దాహం వేయడంతో సమీపంలోని బోరు వద్దకు వెళ్లింది. అక్కడ నీరు తాగుతుండగా ప్రమాదవశాత్తు పక్కనే నీటి మడుగులో పడిపోవడంతో ఊపిరాడక మృతిచెందింది. యాదమ్మ తిరిగి రాకపోవడంతో తోటి కూలీలు వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉంది. కూలీల సమాచారం మేరకు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.